# సంస్కారం

ఉత్తర రామాయణంలో "సీతాపరిత్యాగం" పాఠం చెబుతున్నా. అంత ప్రేమగల అన్నగారు అంతటి దుర్భరమైన పనికి తమ్ముణ్ణే ఏల నియోగించాడా అనిపించింది. ఆ పద్యాలు చదివి వివరించడం కష్టమైపోయింది. నా కంఠంలో వణుకు నాకే స్పష్టంగా కన్పించింది.

అంతలో నా వెనకవైపు గుమ్మందగ్గర నిలబడి "మీకోసం ఎవరో వచ్చారండీ" అని చెప్పి నా సంజ్ఞ గమనించి వెళ్ళిపోయాడు బడి జవాను. కంకటివారి కరుణరస పరిపోషణను గురించి వివరిస్తూ పాఠం పూర్తిచెయ్యడానికి ప్రయత్నిస్తున్నా.

మరో అర్ధ గంటకు మళ్ళీ అడుగుల చప్పుడు వినిపించి బడి జవాను మళ్ళీ వచ్చాడని అనుకొంటూ వెనుతిరిగి చూచాను.

గంగాధరం కన్పించాడు. నాకు ప్రాణం లేచివచ్చింది. చప్పున అతనిదగ్గరకు వెళ్ళాను. "ఎన్నాళ్ళకు కన్పించా

వయ్యా" అంటూ అతను నన్ను గాఢంగా ఆలింగనం చేసుకొన్నాడు. ఇక ఆ పూటకు శెలవుపెట్టి అతన్ని మా యింటికి తీసుకొని వెళ్ళాను. ఎన్నో ఏండ్ల తర్వాత కలుసుకోవటంచేత ఆ పూట అంతా ఒకళ్ళనొకళ్ళం ఒక్క క్షణం విడిచి ఉండలేక పోయ్యాం. అతనూ నేనూ విశ్వవిద్యాలయంలో ఒకే గదిలో ఉండి, చదువుకొన్నాం. ఆ మూడు సంవత్సరాలూ అక్కడ అంతా మేము నిజంగా అన్నదమ్ములమనే అనుకొన్నారు.

అతను పెద్ద ప్రభుత్వోద్యోగి అయ్యాడని నేను సంతోషిస్తే, నే నీ ఉద్యోగంలో స్థిరపడ్డందుకు అతను సంబరపడ్డాడు. సాయంత్రందాకా ఏమేమో మాటాడుకొంటూనే ఉన్నాం. చీకటి పడుతుండగా అతను "ఏమయ్యా ప్రొద్దున్నుంచి ఇప్పటిదాకా మీ యింట్లో గడిపాం కదా మరి కాసేపు మా యింటికి పోదాంరా. అదిగాక మరో పనికూడా ఉన్నది. మా ఆవిడ బి. ఏ. కు వెళుతోంది, గ్రూపు ఒక్కటే మిగిలింది. తెలుగు గ్రూపు కనుక నీ సహాయం అర్థిస్తున్నా" అన్నాడు. "అంత పెద్దమాట అనకు. కాని, ఒక్క విషయం. బి. ఏ. కయితే కళాశాల అధ్యాపకుణ్ణి పిలవడం మంచిది. ఇది నావల్ల అయ్యే పనా!" అని తప్పించుకోవాలని చూస్తే అతను వెంటనే "ఇదిగో నీ దగ్గర దాపరికం ఎందుకూ, ఎవరో పరాయి మనిషి మన ఇంటికి రావడం ట్యూషను చెప్పడం అదీ నాకుగిట్టదు.

ఎవరికి ఏ పని చెప్పాలో నాకు తెలుసు మరి మాట్లాడక పద" అంటూ అతను నన్ను తన ఇంటికి తీసుకొని వెళ్ళాడు.

* * * * *

చదువులో ఆవిడ అత్యంత శ్రద్ధాసక్తులు కనబరచడంతో పాఠం నిరాటంకంగా సాగిపోయింది. పది రోజుల తర్వాత కాఫీలు తాగటం కాగానే "నేనుంటే మన మాటలతో కొంత సమయం వృథా అవుతోంది మీరు చదువుకోండి" అని అతను బయటకు షికారుకూ, క్లబ్బుకూ వెళ్ళిరావడం మొదలు పెట్టాడు. పాఠ్యక్రమం ప్రకారం వ్యాకరణం పూర్తిచేసి అలంకార శాస్త్రం ప్రారంభించాను.

పరీక్షా పరుదీక్షియంలో ఆ సంవత్సరం బి. ఏ కు నిర్ణయించిన ప్రకరణం పాఠం చెబుతుండగా ఆవిడ "ఇదేమిటి ఇంత గ్రంథం ఉంటే నా కిందులో దోష ప్రకరణం చెబుతున్నారు! నేనేం చిన్నదాన్నా చితకదాన్నా!" అన్నది చిరునవ్వు నవ్వుతూ.

మరో పదినిముషాల తర్వాత "ఇప్పటి కీ దోషం చాల్లెండి" అంటూ చప్పున నా చేతిలోని పుస్తకం లాక్కొని బల్లమీదకు గిరాటు పెట్టింది. ఆ లాక్కోవడంలో ఆమె చేతి వేళ్ళు నా వేళ్ళకు తగిలాయి. కాదు ఆమె నా చేతివేళ్ళను కావాలనే ఒక్క క్షణంపాటు స్పృశించినట్లు అనిపించింది.

తల ఎత్తి చూచాను.

ఆవిడ పక్క గదిలోకి వెళుతోంది. రెండు మూడు నిముషాలు ఎదురుచూచి ఇంక ఆ పూటకు పాఠం చాలించి వెళదామని అనుకొంటూ లేచి గుమ్మం వైపు వెళ్ళి పోబో తుండగా ప్రక్క గది గుమ్మం దగ్గర గాజుల చప్పుడు వినిపిం చింది. ఒక్క క్షణం ఆగాను.

"అదేమిటి అప్పుడే బయలుదేరారు. వచ్చి ఈ కాఫీ తాగి మంచి పద్యాలు మరేవైనా చెప్పండి" అన్నది ఆవిడ ముందుకు వస్తూ. నేను వెళ్ళి యథాస్థానంలో కూర్చొని తల వంచుకొని కాఫీ తాగుతుండగా అవిడ నెమ్మదిగా "ఆడుదాని చూడ అర్థంబుచూడ బ్రిహ్మకైన...." అని ఏమో అన్నాడు వేమన, అందుకా "ఏమిటి తల ఎత్తడంలేదు" అని ఇంకా ఏమో మాటాడబోతుంటే నేను అడ్డు తగిలి "ఇవ్వాల్టికి పాఠం చాలు నాకు శెలవిప్పించండి" అని లేచి నిలబడ్డాను. ఆవిడ వెంటనే "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అన్నది ఒక్కసారి విరగబడి నవ్వుతూ.

నాకూ నవ్వు వచ్చింది. ఎక్కడ ఏమి ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందో అనుకొనే నేను నవ్వు ఆపుకొని గుమ్మం వైపు వెళుతుంటే ఆవిడ కొంచెం పెద్దగా "ఆయన వచ్చే దాకా ఉండి వెళ్ళండి. మీకు తెలియదు ఆయన కసలే అను మానం" అన్నది. నేను వెనుతిరిగి వెళ్ళి యథాస్థానంలో

కూర్చుని ఆవిడ అంతకు ముందు గిరాటు పెట్టిన పుస్తకమే తీసుకొని పాఠం చెప్పాను.

ఆ చమత్కార సంభాషణా అదీ ఎక్కడిదాకా వెళు తుందో అన్న భయంచేతనే నేనా తర్వాత రెండు రోజుల దాకా పాఠం చెప్పడానికి వెళ్ళలేదు. మూడో రోజున గంగా ధరం మా యింటికి వచ్చి కారణం అడిగితే ఏమీ లేదనిమాత్రమే చెప్పగలిగాను. అందు కతను "ఈ రెండు రోజులూ మా ఆవిడ నన్ను ఒకటే సాధింపు. నిన్ను నేనేదో అని ఉంటాననీ, అందుకే నువ్వు రావడం మానుకొన్నావనీ ఏమేమో అంటోంది. అయినా నువ్వయినా కారణం లేకుండా ఎందుకు మానినట్టూ- ఊ మరి బయలుదేరు" అని బలవంతపెట్టి వాళ్ళ ఇంటికి నన్ను వెంటపెట్టుకొని తీసుకొని వెళ్ళాడు.

ఆపూట పాఠం పునఃప్రారంభం అయ్యాక "నువ్వు శ్రద్ధగా చదివితే అతను పాఠం ఎందుకుమానేస్తాడు? ఇంక నుంచైనా శ్రద్ధగా చదువు" అని చెప్పి పూర్వంలాగానే షికారుకు వెళ్ళాడు.

ఆపూట ఆవిడ నేను చూడగా తల ఎత్తితే ఒట్టు. ఆ మాదిరిగా రెండు వారాలు గడిచాయి. నా పని సుళు వయ్యింది. ప్రాచీన కావ్య భాగాలు చదవడం పూర్తి అయ్యింది. ఆధునిక కవితాధ్యయనం దాకా వచ్చాం.

ఆధునిక కవిత్వ లక్షణాలను గురించి నేను వివరిస్తుం డగా ఆవిడ అడ్డు వచ్చి "అది సరేకానిండీ ఆయనకు నామీద ఎందుకంత అనుమానం. నేను నిజంగా అందకత్తెనా?" అని ఎంతో అమాయకంగా అడిగింది. ఎటు చెప్పినా చిక్కే కన్పిం చింది నాకు.

నా మట్టుకు నేను నిర్ధారణ చేసుకోవాలని అనిపిం చింది.

తల ఎత్తి ఆవిడవంక పరిశీలనగా చూచాను. అందం కొట్టవచ్చినట్లుండడమంటే ఇదే సుమా అనిపించింది. మరు క్షణంలోనే నేను దృష్టి మరల్చుకొన్నాను. మనస్సు మహా చెడ్డది సుమా దీన్ని అస్తమానం అదుపులో ఉంచవలసిందే అని అనుకొంటూ. నేను మరికొన్ని క్షణాలదాకా ఏమీ మాట్లాడక పొయ్యేసరికి మళ్ళీ అందుకొని "వయస్సుకు చిన్నవారైనా చాలా గడుసువారు. దేనికీ సమాధానం చెప్పరు. అదేమంటే పాఠం మానేసి చక్కాపోతారు. అవును మీకేం, మగ మహా రాజులు" అన్నది ఆవిడ.

ఆ అనడం బహు చమత్కారంగా అన్నది.

దానికి తోడు కన్పించీ కన్పించని చిరునవ్వు కూడాను. ఆ ప్రసంగం తప్పించడానికి "ఊ మరి పాఠం వినండి" అని నేనంటే "ఉండండి. ఓ కప్పు ఓవల్టిన్ తెస్తాను. ఆ తర్వాత మీ యిష్టం వచ్చిన పాఠం చెబుదురుగాని" అంటూ చెంగునలేచి.

జారిన పమిట నిర్లక్ష్యంగా వదిలి వేస్తూ ఒయ్యారంగా నడిచి పక్క గదిలోకి వెళ్ళింది.

ఆ ప్రవర్తన నాకేమీ బాగనిపించలేదు. ఆవిడ అటు వెళ్ళగానే నేనిటు నెమ్మదిగా బయటకు జారుకొన్నాను. దారి పొడుగూతా నా భయస్వభావానికి నన్ను నేను నిందించుకొన్నాను.

ఆ మరునాడు పాఠం ప్రారంభంకాకముందు ఆవిడ చనువుగా "అదేమిటండీ నిన్న అలా వెళ్ళిపొయ్యారూ! నాతో సరదాగా మాట్లాడడం కూడా భయమా మీకు. ఏం ఆయన నన్ను గురించి ఏమైనా చెప్పారా? చెప్పే మనిషే లెండి. అయితే నేనేం మహాపతివ్రతనని గొప్పలు చెప్పుకోవడం లేదు. ఆ మాటకు వస్తే ఆయనా ఏం తక్కువ తిన్నవారు కాదు. ప్రథమ, ద్వితీయ వివాహాల మధ్య కాలంలో ఆయన గారు ఎంత విచ్చలవిడిగా తిరిగారో మాకు తెలుసు....అంటూ ఇంకా ఏమో వివరించబోతుంటే నేను అడ్డుకొని "దయచేసి ఈ ప్రస్తావన మానెయ్యండి, లేదంటారా నాకు శెలవిప్పించండి" అని అనగానే ఆవిడ కపీమని పుస్తకం తెరిచింది.

ఆ వారాంతంలో గంగాధరం మా బడికివచ్చి "రేపు మా ఆవిడ పుట్టినరోజు పండుగ చేసుకొంటాననంటున్నది. పార్టీ ఏర్పాటు చేస్తున్నది. నువ్వు తప్పక రావాలి. ఇవ్వాళ పాఠం వద్దన్నది. ఏవో కొనడానికి బజారుకు వెళతానని చెప్పింది.

రేపు మాత్రం తప్పక రావాలి సుమా" అని నాకు మరీ మరీ చెప్పి వెళ్ళాడు.

*     *     *     *     *

అతను సంతోషిస్తాడనీ, ఒట్టి చేతులతో వెళ్ళడం బాగుండదనీ. అప్పుచేసి ఆవిడకు బహుమానంగా ఓ వెండి గంధపుగిన్నె తీసుకొని వెళ్ళాను

ఎంతో సంబరపడుతూ, త్వర త్వరగానే వెళ్ళాను. కాని తీరా వెళ్ళేసరికి ఆ యింట సందడేలేదు. ఏమిటా, ఎందుకా అని గుమ్మందాకా వెళ్ళాను తలుపు తీసే ఉన్నది. వీధివాకిలి తెరతొలగించి తొంగిచూచాను.

ఒక్కసారి చకితుణ్ణి అయ్యాను. ఆ వస్త్రధారణ, అలంకరణ. ఓ యువ జమీందారిణిలా కన్పించిందావిడ. సోఫాలో పడుకొని విశ్రాంతి తీసుకొంటున్నది. మోకాళ్ళదాకానూ, వక్ష ఉపరి భాగంపై బాగా నడుముదాకానూ, అచ్చాదనలేదు. దేహయష్టి ఇంతగా ఆకర్షిస్తుందా అనిపించింది ఒక్క క్షణం. ఆ స్థితిలో ఆవిడను మరోసారి చూడడం కూడా దోషమేనని అనిపించి చప్పున వెనుతిరిగాను. పొరపాటున నా చెయ్యి తలుపుకు తగిలి చప్పుడైంది.

ఆవిడ ఉలికిపడినట్లు లేచింది. ఆవిడ నెమ్మదిగా లేచి కూర్చుని. పమిట సరిచేసుకొని "మీరా అదేమిటి ఎప్పుడు వచ్చారూ — అప్పుడే వెళ్ళిపోతున్నారేమిటి? రండి రండి

కూర్చోండి" అని ఆహ్వానించింది. నేను వెళ్ళి కూర్చున్న తర్వాత ఆవిడ లోపలకు వెళ్ళి కాఫీ ఫలహారాలు తెచ్చి బల్ల మీద పెట్టి "తీసుకోండి" అన్నది చాలా ఆప్యాయంగా.

నేను కాఫీ తాగుతూ "అయితే పార్టీ అయిపోయిందన్నమాట. అతనేడీ అతిథులను సాగనంపడానికి వెళ్ళాడా?" అంటూ నేను తెచ్చిన బహుమానం ఆవిడకు ఇచ్చాను. ఆవిడ ధన్యవాదాలు చెప్పింది.

"ఆలస్యంగా వచ్చినట్లున్నాను. అతనికి కోపంవచ్చిందా? ఏమన్నా అన్నాడా!" అని అడిగితే ఆవిడ అకారణంగా నవ్వుతూ "అసలుంటేనేగా. ఎవరికో జబ్బుగా ఉందని టెలిగ్రాంవస్తే రాత్రికి రాత్రి కాకినాడ వెళ్ళారు. నా పుట్టిన రోజు పండుగ ఇల్లా తయారైంది. పోన్లెండి. మరేం బెంగ లేదు. ఉదయం నుంచి నా యిష్టా రాజ్యంగా గడిపాను. ఈపూట నాల్గింటి నుంచీ మీ కోసం ఎదురు చూస్తున్నా. కాసేపు చదువుకోంటూ" అంటూ ఆవిడ ప్రక్క గదిలోకి వెళ్ళింది

"ఈపూట పాఠం వద్దులెండి. మీరు సరదాగా ఏ సినిమాకో వెళ్ళిరండి" అని ఆవిడ రాగానే చెప్పి వెళదామని అనుకొన్నాను. పది నిమిషాలదాకా ఆవిడ రాలేదు. చెప్పేసి పోదామని లేచి నిలబడి ఆవిడ రాకకోసం ఎదురుచూస్తూ.

ఏమీ తోచక గోడలకు ఉన్న ఫోటోలవంక చూస్తున్నా. గంగాధరం చిన్నప్పటి ఫోటో ఒకటి బాగా ఆకర్షించింది.

ఆవిడ ఎప్పుడు వచ్చిందో, నెమ్మదిగా వచ్చి నా వెనుకగా నిలబడి "ఏమిటండీ ఆయన ఫోటోవంక అంత ఇదిగా చూస్తున్నారు" అన్నది. నేను వెనుతిరగకుండానే "అప్పుడతను నిజంగా ఎంత బాగున్నాడో!" అన్నాను—అంతకు ముందు కొన్ని నిముషాలుగా నేను మనస్సులో అనుకొంటున్న మాటే పైకి అన్నాను.

"ఇప్పుడు మీరెంత బాగున్నారో!" అంటూ ఆవిడ ఏ విధమైన ముందు సూచనా, హెచ్చరికా లేకుండా హఠాత్తుగా వచ్చి గట్టిగా నా కళ్ళు మూసింది. మరు క్షణంలో ఆవిడ సర్వ శరీరమూ నన్ను స్పర్శిస్తున్నది. మొదట నాకేదో మైకం కమ్ముతున్నట్లు అనిపించింది. ఆ వైవశ్యాన్ని విదలించివేస్తూ మరుక్షణంలో నా శరీరం గజగజ వణకడం మొదలు పెట్టింది.

అంతలో మరింత సన్నిహితం అవుతూ బాహువులతో నన్ను మరింత గట్టిగా బంధిస్తూ "అంత భయం దేనికి" అని ఆవిడ అంటున్న మాటలు విన్పించేసరికి నాకు ఒక్కసారి తెలివి వచ్చి నట్లయింది. జరిగిందీ, జరగనున్నదీ స్ఫురణకు వచ్చింది చప్పున ఆవిడ బాహుబంధం నుంచి విడివడి, తప్పుకొని దూరంగా నిలబడ్డాను.

ఆవిడవంక తీక్షణంగా చూచాను. కాని ఆవిడ నావంకే చూడడంలేదు. ఒయ్యారంగా నిలబడి తల వంచుకొని కాలి బొటనవేలితో నేలమీద రాస్తున్నది.

పరిస్థితి అర్థం అయ్యింది.

భయ విహ్వలత పోయి కోపావేశం వచ్చింది నాకు. అవిడ ఎంతకూ తల ఎత్తక పొయ్యేసరికి నాకు కోపం ఆగక "మర్యాదా భంగం జరిగింది. అతనూ నేనూ ఎంత సన్నిహితులమో ఇది మా ఉభయులకూ ఎంత బాధకరమో మీరు ఒక్కరవ్వయినా ఆలోచించారా? అనకూడదుకానీ—మీక్కానీ, నాక్కానీ, అంత కావాలనే అనుకొంటే పరాయివాళ్ళు కన్పించకపోతారా? అయినా ఏమిటండీ ఇది! మీరు చిన్నపిల్లలా నేను చిన్నపిల్లవాణ్ణా!" అన్నాను.

"కాదు కనుకనే" అన్నదావిడ వెంటనే.

నాకు మళ్ళా చెర్రున కోపం వచ్చింది. మళ్ళీ అంతలో అంతటి దుస్సాహసానికి దిగిన మనిషితో వాదించడం ప్రమాదకరమని అనిపించింది. తమాయించుకొని నెమ్మదిగా వెనుతిరిగి గుమ్మంవైపు నడిచాను. కాని ఎక్కడో అడుగుల చప్పుడు వినిపించి ఒక్క క్షణం ఆగాను. ఆ శబ్దం ఎటునుంచి వచ్చిందో అర్థం కాలేదు. తిరిగి ఆవిడవైపు చూచాను. పూర్వకంటె కొంచెం దూరంగా వెళ్ళి నిలబడినట్లు అనిపించింది నోటిమీద చూపుడు

వేలు ఉంచి "ఉష్" అని నెమ్మదిగా అంటూ ఎడమచేత్తో వెళ్ళి కూర్చోమని సంజ్ఞ చేసిందావిడ.

ఆ ప్రవర్తన నాకు మరీ అసహ్యమనిపించింది. "ఇక చాల్లెండి మీ సత్కారం పొరపాట్లు ఎవరైనా చేస్తారు. కాని కొంచెం విచక్షణఉండాలి. చెప్పినప్పుడైనా కాస్త తెలివి తెచ్చుకోవాలి" అని నేను అంటుంటే. ఆవిడ అంతలో ఉగ్ర స్వరూపం తాలుస్తూ నా మాటలు వినపడకుండా పొయ్యేలా చేస్తూ, పెద్దగా "మంచీ మర్యాదా ఉండక్కర్లా. నాకు చదువు చెబుతున్నారనీ ఆయన కెంతో ఆత్మీయులనీ గౌరవంకొద్దీ చనువుగా కన్పిస్తే కొంగు పట్టుకొని లాగుతారా! అదేమంటే కోపం—పైపెచ్చు సారంగనీతులూనా?" అంటూ ఏకంగా అరవడమే మొదలు పెట్టింది.

నేను నిర్ఘాంతపొయ్యాను ఎంత గడుసుతనం! ఎంత మోసం. అపవాదు వేస్తానని భయపెట్టడం కాబోలు ఇది. "ఛీ ఇక్కడ మరొక్క క్షణం కూడా ఉండకూడదు" అనుకొంటూ మునిపళ్ళతో క్రింది పెదిమ గట్టిగా అదిమిపట్టి, పట్టలేకపోతున్న కోపాన్ని అణచుకొంటూ అప్రియత్నంగా వస్తున్న ఛీత్కారాన్ని పెదవిదాటి రానీయకుండా చేస్తూ వెనుతిరిగాను.

ఎదురుగా గంగాధరం కన్పించాడు.

వీధి గుమ్మందగ్గర గుమ్మంతెర చేత్తో తొలగించి గుమ్మానికి అవతలివైపు నిలబడిఉన్నాడతను. అతనలా కన్పించేసరికి నాకు మొదట అమితాశ్చర్యం. అంతలో అతన్ని చూచే కాబోలు ఆవిడ

ఇలా రంగు మార్పిండి అన్న ఆలోచన వచ్చేసరికి అంతకు పదిరెట్లు భయాందోళనలూ కలిగాయి. గుండె దడదడలాడిపోయింది.

ఏమిటిది అని అతను అడిగితే బాగుండు అనిపించింది. అతను మాటాడలేదు. పొగలూ సెగలూ ఎగజిమ్ముతూ మరో క్షణంలో బ్రద్దలు కావడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలా కన్పించాడతను నా కా క్షణంలో. ఏమి చెయ్యాలో నాకు బొత్తిగా తోచకుండాపోయింది.

మరి కొన్ని క్షణాల తర్వాత గంగాధరం నిజంగా కోపంగానే నా దగ్గరకు వస్తూ ఉండగా ఆవిడ చప్పున ముందుకు వచ్చి, మా యిద్దరి మధ్యా నిలబడి, అతనితో "మీరిద్దరూ ఏ పరిస్థితులల్లోనూ బజారు మనుష్యుల్లా ప్రవర్తించడానికి మాత్రం వీల్లేదు. జరిగింది చాలా స్వల్ప విషయం. కాని ఎవరి స్వభావం ఎటువంటిదో దాంతో అర్థం అయ్యింది. నేను మందలించాను చాలు" అని నా వైపు తిరిగి కోపంగా చూస్తూ "మిమ్మల్ని నా తరఫునా ఆయన తరఫునా అడక్క ముందే క్షమిస్తున్నా. ఇంక బయటకు నడవండి. ఒక్క మాటకూడా వద్దు నేను సహించలేను. ముందు నడవండి బయటకు" అని గద్దించింది. ఆడ పులిలా గర్జించింది.

నేను నిజంగా కొయ్యబారి పోయ్యాను. గంగాధరం నెమ్మదిగా వచ్చి నా భుజంమీద చెయ్యివేసి "నిజమే అనవసరపు మాటలవల్ల ఉభయత్రా ప్రయోజనం ఉండదు. అది చెప్పిన మాటే బాగుంది" అన్నాడు మృదువుగా.

"అదీ నిజమైన సంస్కారమంటే" అన్నది ఆవిడ పెద్దగా కొంచెం కటువుగా.

"అతనా గుమ్మంలో కన్పించినప్పుడే జరిగిన విషయం చెప్పి ఉండవలసింది!" అనుకొన్నాను. మరు క్షణ లో "అదే జరిగి ఉంటే అతను నమ్మేవాడే—నమ్మితే ఈపాటి: ఆవిడ గతేమయ్యేదో — చెప్పకపోవడమే మంచిదయ్యిందని" అని పించింది. ఇప్పుడింక నిజం చెప్పినా అతను వినే పరిస్థితిలో అయినా లేడని కూడా అనిపించింది.

తల ఎత్తకుండా గుమ్మం వైపు నడిచాను. "ఇంత మైత్రీ క్షణంలో ఇలా బొగ్గయిపోయిందే. ఎమిటి నేను చేసిన నేరం! ఇంక మళ్ళీ అతని ముఖం చూడగలనా? ఈ తప్పు నా నెత్తిన వేసుకొని జీవితాంతం మొయ్యవలసిందేనా? ఇది నా తరమా? వెనక్కు వెళ్ళి నమ్మినా నమ్మకున్నా ఆ తర్వాత ఏమైనా అతనికి నిజం చెప్పేసి హృదయావేదన తీర్చుకొంటే!" ఎన్నెన్నో ఆలోచనలు నన్ను ఊదర పెట్టినాయి. శర పరం పరలా వచ్చాయి అవి. అవి వరద వాగుల్లా వచ్చి నన్ను సుడి గుండంలోకి లాక్కొని వెళుతున్నాయని అనిపించింది. బాధ భరించలేక పొయ్యాము. వెనక్కు వెళదామని గట్టిగానే అను కొన్నాను. క్షణకాలం గుమ్మం దగ్గర ఆగాను కూడాను. కాని వెనక్కు ఒక అడుగు కూడా వెయ్యలేకపోయ్యాను. "ఆత్మీయుని విషయంలో నువ్వు చెయ్యవలసిన పనికాదది— పద. ఆలస్యం చెయ్యకు. ఒక వేళ నీ మాట నమ్మవలసివస్తే

అదీ అతనికి బాధేకదా పద బయటకు" అని ఎవరో ప్రబోధిస్తు న్నట్లే అనిపించింది.

ప్రళయ ప్రభంజనాల విజృంభణతో రెపరెపలాడే రావి ఆకులా నేను నిలువునా గజగజ వణికి పొయ్యాను. విలవిల లాడి పొయ్యాను. అంతలో గాలికి కొట్టుకొని పొయ్యే ఎండు టాకులా ముందుకు అప్రియత్నంగా సాగిపొయ్యాను. కాని గేటుదాకా వచ్చాక హృదయం మరింత భారమైనట్లు అనిపించింది. దుఃఖావేశానికి తట్టుకోలేక, ముందుకు అడుగు వెయ్య లేక ఆగిపొయ్యాను. రెండు చేతులతోనూ ముఖం కప్పు కొన్నాను.

నా కాళ్ళు తేలిపోతున్నట్లు, కళ్ళు తిరుగుతున్నట్లు, కాళ్ళక్రింద భూమి కృంగుతున్నట్లు అనిపించింది. మళ్ళీ అంతలో అప్పటి దాకా నా గుండెలో గుచ్చి ఉంచిన చుర కత్తిని ఎవరో ఒక్కసారిగా, ఒక్క ఊపున పెరకి వేసినట్లూ, మరీ అయోమయం అవుతున్నట్లూ అనిపించింది. ముంచుకొని వస్తున్న అంతటి అయోమయ స్థితిలో కూడా నిజంగా ఎవరైనా నన్ను అలా చురకత్తితో పొడిచి ఉంటే ఎంత బాగుండేది! ఈ బాధ తప్పేదికదా !" అని అనిపించింది.